TGTEL/25/A0784
నేటి ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.prabhatasurya.com

## జిల్లా అనుబంధం

# గట్టుప్పల చేనేతకు పూర్వ వైభవం తెద్దాం!

## కార్మికుల ఉపాధికి సహకార సంఘాన్ని బలోపేతం చేయాలి: కర్నాటి వజ్రమ్మ



గట్టుప్పల / నేటి ప్రభాత సూర్య: నష్టాల బారిన పడిన చేనేత కార్మికులను ఆదుకుని, గట్టుప్పల చేనేత సహకార సంఘానికి పూర్వ వైభవం తీసుకురావడానికి సమష్టిగా కృషి చేయాలని సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ అన్నారు. చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించేలా సంఘాన్ని తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గట్టుప్పల చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం కామన్ ఫెసిలిటీ సెంటర్ భవనంలో 75వ వార్షికోత్సవం, 57వ సాధారణ మహాసభ నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వజ్రమ్మ మాట్లాడుతూ గత కొంతకాలంగా వెనుకబడిన చేనేత సహకార సంఘాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి సభ్యులు, కార్మికులు, పాలకవర్గం కలిసి పనిచేయాలని కోరారు. సంఘం బలోపేతమైతేనే చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లా మాజీ ఆప్కో డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా అవసరమైన నిధులను సమకూర్చి గట్టుప్పల చేనేత సహకార సంఘానికి పునర్జీవం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో తగిన మూలధనం లేకపోవడంతో సంఘం క్రమంగా బలహీనపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని, సంఘాన్ని తిరిగి క్రియాశీలకంగా మార్చి కార్మికులకు పని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో చేనేత రంగంలో గట్టుప్పలకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని వెంకటేశం గుర్తుచేశారు. పోచంపల్లిలో సుమారు 1,200 మగ్గాలు ఉండగా, గట్టుప్పలలో సుమారు 1,000 మగ్గాలతో రెండో స్థానంలో ఉన్న ఘనత ఉందన్నారు. గత వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం, నిధులు సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

అనంతరం పలువురు మాట్లాడుతూ గట్టుప్పల చేనేత సహకార సంఘానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కర్నాటి వెంకటేశం చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ నామని జగన్నాథం, పాలకవర్గం ఉపాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి నరేందర్, కోశాధికారి మహాలక్ష్మి, డైరెక్టర్లు చంద్రమౌళి, వెంకటేశం, జగన్, యాదయ్య, విజయలక్ష్మి, మేనేజర్ అయోధ్య, రమేష్, గణేష్, నాగమణి, గుర్రం సత్తయ్య, కిషోర్, శ్రీనివాస్, ఆంజనేయులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## 33 ఏళ్ల సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు

## పదవీ విరమణ చేసిన ఐడపిఆర్ అటెండర్ షేక్ లియకత్ అలీ



రంగారెడ్డి/ సెప్టెంబర్ 30,నేటి దిక్సూచి :రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో గత 33 సంవత్సరాలుగా క్లీనర్‌గా నిబద్ధతతో విధులు నిర్వహించిన శ్రీ షేక్ లియకత్ అలీ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ ఆవరణలో ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 33 ఏళ్ల సుదీర్ఘ సేవా కాలంలో ప్రతినిత్యం క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనతో కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ సహచరులందరి మన్ననలు పొందిన లియకత్ అలీ సేవలను ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం ఆయనను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ జ్ఞాపికను అందజేశారు. షేక్ లియకత్ అలీ పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని అధికారులు, సిబ్బంది ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి బాలేశ్వరి, సహాయ అధికారి ఏవీఎస్ ప్రసాద్, టైపిస్టు అనిత, ఆఫీస్ సబార్డినేట్ ఫకీర్ చంద్ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



2

నేటి ప్రభాత సూర్య

బుధవారం

9-30-2026

# పేదలకు సన్నబియ్యం.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మర్రిగూడ, నేటి ప్రభాత సూర్య :పేద ప్రజలకు సన్నబియ్యం అందించడం దేశంలోనే వినూత్నమైన సంక్షేమ పథకమని మర్రిగూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఎంఆర్వో జక్కర్తి శ్రీనివాస్‌తో కలిసి రామదాసు శ్రీనివాస్, మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య తదితరులు లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రామదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో పేద కుటుంబాలకు సన్నబియ్యం అందించడం సంతృప్తికరమైన విషయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ

కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్ గౌడ్, బ్యాంక్ డైరెక్టర్ బాయికాడి కొండల్ గౌడ్,




సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు